సాక్షి
మంచిర్యాల
గురువారం । 15 । ఫిబ్రవరి । 2024



ఘనంగా వసంత పంచమి

జిల్లాలో బుధవారం వసంతపంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం చిన్నారులకు తల్లిదండ్రులు అక్షరాభ్యాస పూజలు జరిపించారు. 9లో▸

కు.ని వైద్య శిబిరం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో బుధవారం కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స(వ్యాసెక్టమీ) వైద్య శిబిరం నిర్వహించారు. 20 మంది పురుషులకు వ్యాసెక్టమీ ఆపరేషన్లు చేశారు. వీరికి రూ.1100 పారితోషికం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి జీసీ సుబ్బరాయుడు అందజేశారు. వైద్యులు యూకూబ్‌పాషా, అరుణశ్రీ, నవీన్, ఏఎస్‌వో దామోదర్, జిల్లా మాస్‌మీడియా అధికారి జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0 /20.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. తూర్పు దిశగా గాలులు వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బుగ్గలో కలెక్టర్ ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న కలెక్టర్ దంపతులు

బెల్లంపల్లిరూరల్: మండలంలోని కన్నాల గ్రామ పంచాయతీ పరిధి బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయాన్ని కలెక్టర్ బదావత్ సంతోష్ దంపతులు బుధవారం సందర్శించారు. వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో పాలాభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాలను పరిశీలించి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఎంతో ప్రత్యేకంగా ఉందన్నారు. ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ దంపతులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీదేవి, ఈవో బాపురెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, జేపీఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రామగుండం సీపీ శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ



సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీస్ కమిషనర్(సీపీ)గా ఎం.శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా కమిషనరేట్ సిబ్బంది గౌరవ వందనం ద్వారా ఘనంగా స్వాగతం పలికారు. మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ మర్యాద పూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతించారు. అనంతరం కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులు కలిసి మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు పోలీసులు జవాబుదారీతనంగా ఉండాలని సూచించారు. అధికంగా నమోదవుతున్న నేరాల వివరాలు తెలుసుకున్నారు.


ఈవీఎంల మొదటి దశ తనిఖీ



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

పాతమంచిర్యాల: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఈవీఎంల మొదటి దశ తనిఖీ పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ తెలిపారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లో ఉన్న ఈవీఎం గోదాములో మొదటి తనిఖీని పరిశీలించారు. 2024 లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పది రోజులపాటు ఈవీఎంల తనిఖీలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు పరిశీలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు సీఓఈ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బెల్లంపల్లి బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీఓఈ) విద్యార్థులు ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు ఎంపికయ్యారు. కోల శశివరుణ్, కొండగొర్ల అరుణ్‌సందేశ్, ఎలుకటూరి శ్రీవిఘ్నేష్ ఎంపికైనట్లు సీఓఈ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ప్రకటించారు. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులు తయారు చేసిన వినూత్న ఆవిష్కరణలను ప్రత్యేక పోర్టల్ ద్వారా పోటీకి పంపించాల్సి ఉంటుంది. ఉత్తమ ఆవిష్కరణలను ఎంపిక చేసి అవార్డులు అందజేశారు. సైన్స్ ఉపాధ్యాయుడు కొక్కుల రాజేశ్వర్ మార్గదర్శకంలో దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ముగ్గురి ప్రాజెక్టులు ఎంపిక కావడం గమనార్హం. విద్యార్థులను బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సైదులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఓఈ సూపరింటెండెంట్ అవధూత రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ కోట రాజ్‌కుమార్, జేవీసీ శ్రీనివాస్, గైడ్ టీచర్ రాజేశ్వర్, రాజ్‌కుమార్, అనిరుద్, రాజేందర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులకు జలం

- వేసవికి ముందే అడవిలో నీటి సౌకర్యం
- నీటికుంటలు, ర్యాంప్‌వెల్స్, సోలార్ పంపులు వినియోగం
- తాగునీటి సమస్య రాకుండా జాగ్రత్తలు



తాళ్లపేట రేంజ్‌లో ఏర్పాటు చేసిన ర్యాంప్‌వెల్



జన్నారం రేంజ్‌లోని వాగులో ఏర్పాటు చేసిన చెలిమె

జన్నారం: వేసవిలో ఎండల తీవ్రత పెరిగి వన్యప్రాణులకు నీటి ఇబ్బందులు రాకుండా.. వన్యప్రాణుల దాహం తీర్చేలా అధికారులు చర్యలు చేపట్టారు. గతంలో సాసర్‌వెల్‌లో ట్రాక్టర్ల ద్వారా నీటిని నింపి వన్యప్రాణులకు అందించే పద్ధతికి స్వస్తి పలికి సహజ సిద్ధమైన నీటిని అందించేందుకు పనులు చేపడుతున్నారు. నిల్వ ఉన్న నీటితోపాటు సహజసిద్ధమైన జలధారలు, వాగులనీటిని వన్యప్రాణులు ఇష్టంగా తాగే అవకాశం ఉన్నందున అడవిలో నీటి కొరత లేకుండా జలధారాలు, నీటిచెలిమెలు, వాగులనీటిని అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. వీటితోపాటు నీటికుంటలు, ర్యాంప్‌వెల్‌లు, సోలార్‌పంపులు, సాసర్‌వెల్ ద్వారా నీరందించేందుకు పనులు ప్రారంభించారు. కవ్వాల్ టైగర్ జోన్‌లో ఖానాపూర్, జన్నారం, మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి అటవీ డివిజన్లలో టైగర్‌ప్రాజెక్టు ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం ఆదేశాల మేరకు జిల్లా అటవీ సంరక్షణ అధికారి(డీఎఫ్‌ఓ) శివ్‌ఆశిష్‌సింగ్ సూచనలతో అధికారులు నీటి సౌకర్యంపై దృష్టి సారించారు. జన్నారం అటవీ డివిజన్‌లోని మూడు అటవీ రేంజ్, 40 అటవీ బీట్‌లలో నీటి సౌకర్యం ఏర్పాటు చేస్తున్నారు. ప్రతీ కిలోమీటరు దూరంలో ఒక రకమైన నీటి వనరు ఉండేలా చర్యలు చేపడుతున్నారు. ర్యాంప్‌వెల్స్‌ను ఉపయోగించి నీటిని అందించేందుకు పనులు ప్రారంభించారు.

వాగుల్లో చెలిమెలు

అడవుల్లో సెలయేర్లు, వాగులు, వంకలు అనేకంగా ఉంటాయి. వీటిని వినియోగించి వన్యప్రాణుల దాహం తీర్చేందుకు అధికారులు పలు మార్గాలు ఎంచుకున్నారు. ఇందులో వన్యప్రాణులకు సహజసిద్ధమైన నీరందించడం ఒకటి. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని కన్హా టైగర్‌జోన్‌లో మాదిరిగా కవ్వాల్ టైగర్‌జోన్‌లో కూడా ఆనకట్టలు వేసి నీరు నిలిచేలా పనులు చేపడుతున్నారు. జన్నారం డివిజన్‌లో గత సంవత్సరం 30చోట్ల ఇలాంటి ఆనకట్టలు కట్టగా, ఈ ఏడాది వాటి సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వాగునీటికి అడ్డంగా బండరాళ్లు, ఇసుకతో కట్ట కట్టడం వల్ల నీరు నిలిచి చెలిమెలా తయారవుతుంది. పారే నీరు శుభ్రంగా ఉంటుంది కాబట్టి వన్యప్రాణులు ఇష్టపడుతాయి.

ర్యాంపు వెల్స్

నీటి ఊటలు ఉన్న ప్రదేశంలో బావిలా గుంత తవ్వి నీరు పడగానే వన్యప్రాణులు సులువుగా దిగి నీరు తాగేలా ర్యాంపు తయారు చేస్తారు. మూడు మీటర్ల లోతు, పది మీటర్ల వెడల్పుతో గుంత తవ్వుతారు. అందులోకి స్వచ్ఛమైన నీరు ఊటల ద్వారా చేరుతుంది. రెండు వైపుల ర్యాంపుల ఏర్పాటుతో వన్యప్రాణులు అందులోకి దిగి నీటిని తాగుతాయి. గత సంవత్సరం 25వరకు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది మరో 28చోట్ల ర్యాంప్‌వెల్స్ ఏర్పాటు చేయనున్నారు. వీటిని ప్రతీ రెండ్రోజులకోసారి బేస్‌క్యాంపు సిబ్బంది, బీట్ అధికారులు పర్యవేక్షిస్తారు.

సాసర్‌వెల్

నీటికుంటలు, సోలార్‌పంపులు, ర్యాంపువెల్స్ లేని ప్రదేశాల్లో, ఎత్తయిన ప్రాంతంలో సీసీ సాసర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో ట్యాంకర్ ద్వారా నీరు నింపి వన్యప్రాణులకు అందిస్తారు. ఈ ఏడాది అడవిలో చేతిపంపులు ఏర్పాటు చేసి వాటి వద్దనే సాసర్‌లు ఏర్పాటు చేశారు. బేస్‌క్యాంపు సిబ్బంది, బీట్ అధికారులు నాలుగు రోజులకోసారి చేతిపంపు ద్వారా సాసర్‌వెల్‌లను నింపే విధంగా ఆదేశాలు జారీ చేశారు. గతంలో అత్యధికంగా సాసర్‌ల ద్వారా నీటిని అందించేవారు. దీంతో ట్రాక్టర్ శబ్దంతో వన్యప్రాణులు భయపడే అవకాశం ఉన్నందున ఈ పద్ధతిని తగ్గించారు.

సోలార్ పంపులు

అడవిలో సోలార్ విద్యుత్ ద్వారా నడిచే పంపుల ద్వారా నీటి సౌకర్యం కల్పిస్తున్నారు. జన్నారం అటవీ డివిజన్‌లో గత సంవత్సరం 18 సోలార్ పంపుల ద్వారా కుంటల్లోకి నీటిని వది సౌకర్యం కల్పించారు. ఈ సంవత్సరం వాటి సంఖ్య 22కు పెంచారు. ఎండల తీవ్రతకు కుంటల్లో నీరు ఇంకిపోయే అవకాశం ఉంది. దీంతో సోలార్ పంపుల ద్వారా నీటిని కుంటల్లోకి వదులుతున్నారు. జన్నారం అటవీ డివిజన్‌లో అత్యధికంగా సోలార్ పంపుల ద్వారా నీరందిస్తున్నారు.



కుంటలో నీరు నింపేందుకు సోలార్ పంపు

నీటికుంటలు



ఇందన్‌పల్లి రేంజ్‌లో కుంట

అడవిలో భూగర్భజలాలు పెంపొందించేందుకు నీటి సౌకర్యం, వర్షపు నీరు వృథాగా పోకుండా నిర్మించిన నీటికుంటలపై అధికారులు సారించారు. జన్నారం అటవీ డివిజన్‌లో 300వరకు నీటికుంటలు ఉండగా అందులో 190 నీటికుంటల్లో ప్రస్తుతం నీరుంది. ఏప్రిల్, మే నెల వరకు 90 నీరు ఉండే అవకాశం ఉంది. కోర్ ఏరియాలో నీటి కుంటలు అధికంగా నిర్మించారు.

పనులు ప్రారంభించాం



అడవిలో నివసించే వన్యప్రాణులకు ఆహారంతోపాటు నీటి సౌకర్యం కల్పించేందుకు పలు రకాల చర్యలు చేపట్టాం. ఎఫ్‌డీపీటీ, డీఎఫ్‌ఓల ఆదేశాల మేరకు అడవిలోని వాగులలో ప్రవహించే నీటికి ఆనకట్టలు కట్టి, ర్యాంప్‌వెల్స్, చెలిమెల ద్వారా సహజసిద్ధమైన నీటిని వన్యప్రాణులకు అందించేందుకు చర్యలు చేపట్టాం. సీసీ సాసర్ల వినియోగం తగ్గించి సహజసిద్ధమైన నీరందించేందుకు పనులు చేస్తున్నాం.

– హఫీజొద్దీన్, ఫారెస్ట్ రేంజ్ అధికారి

బెల్లంపల్లి ఏసీపీగా రవికుమార్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఏసీపీగా ఏ.రవికుమార్ బుధవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ ఏసీపీగా పని చేస్తున్న పంతాటి సదయ్య ఆసిఫాబాద్ డీఎస్పీగా బదిలీ కాగా, ఆయన స్థానంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్‌బీ విభాగంలో డీఎస్పీగా పని చేస్తున్న రవికుమార్ నియామకం అయిన విషయం తెలిసిందే. రవికుమార్ బాధ్యతలు చేపట్టగా.. సీఐలు, ఎస్సైలు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌గా..

బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్‌గా జి.మల్లారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి కమిషనర్ ఆర్.భుజంగరావు ఆసిఫాబాద్ మున్సిపాలిటీకి బదిలీ కాగా, ఆయన స్థానంలో నారాయణఖేడ్ మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డిని బెల్లంపల్లికి బదిలీ అయిన విషయం తెలిసిందే. మల్లారెడ్డికి భుజంగరావు బాధ్యతలు అప్పగించారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్‌గా మురళీకృష్ణ



మురళీకృష్ణ

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్‌గా మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీలో మేనేజర్‌గా పనిచేస్తున్న ఎస్.మురళీకృష్ణను నియమించారు. ఆయనకు పదోన్నతి కల్పిస్తూ క్యాతనపల్లి మున్సిపాలిటీలో పోస్టింగ్ కల్పించారు. ఇక్కడ మేనేజర్‌గా పనిచేస్తున్న కే.నాగరాజుకు కూడా పదోన్నతి కల్పిస్తూ కరీంనగర్ జిల్లా చొప్పదండి మున్సిపల్ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వేసవిలో మొక్కలు కాపాడాలి



కొత్తూరులో మొక్కలను పరిశీలిస్తున్న రాహుల్

లక్సెట్టిపేట: వేసవికాలంలో మొక్కలను జాగ్రత్తగా కాపాడాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. బుధవారం మండలంలోని కొత్తూరు, సూరారం గ్రామాల్లో నిర్వహిస్తున్న హరితహారం మొక్కల కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో నీటి కొరత ఉంటుందని, ప్రత్యేకంగా నీరందిస్తూ కాపాడాలని సూచించారు. గ్రామాల్లో చెత్త డంపింగ్‌యార్డులను వినియోగించుకోవాలని, ప్రతీ గ్రామంలో చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉండేలా చూడాలని అన్నారు. అనంతరం డంపింగ్‌యార్డు ప్రదేశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాఘవేంద్రరావు, వ్యవసాయాధికారి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బియ్యంపై అధికారుల విచారణ

తాండూర్: మండల కేంద్రంలోని కేజీబీవీలో బియ్యం పక్కదారి పట్టాయనే ఆరోపణల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. కేజీబీవీ సిబ్బంది రేచిని గ్రామ శివారులోని ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి 42.50క్వింటాళ్ల బియ్యాన్ని విద్యాలయానికి తరలించే క్రమంలో గోల్‌మాల్‌కు యత్నించారని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. పాఠశాల సిబ్బంది చిన్న ట్రాలీ తీసుకు రావడంతో రెండు ట్రిప్పుల్లో బియ్యం తరలించాల్సి వచ్చిందని ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జి శ్రీనివాస్ తెలిపారు. మరోవైపు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మురళీధర్ విచారణ చేపట్టారు. కేజీబీవీకి వెళ్లి స్టాక్ రిజిష్టర్, మిగిలి ఉన్న స్టాక్ వివరాలు పరిశీలించారు. సిబ్బంది, విద్యార్థులను విచారించారు. ఎలాంటి అవకతవకలు జరగలేదని, సిబ్బంది మధ్య ఉన్న వైరుధ్యాలే తప్పుడు ప్రచారానికి దారి తీసినట్లు రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు.

కవ్వాల్‌లో ట్రైయినీ సెక్షన్ అధికారుల పర్యటన



వివరాలు తెలియజేస్తున్న ఎఫ్‌ఆర్‌వో

జన్నారం: దూలపెల్లి ఫారెస్టు అకాడమీ నుంచి శిక్షణలో భాగంగా శిక్షణ సెక్షన్ అధికారులు బుధవారం కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో పర్యటించారు. 11మంది పురుషులు, ఐదుగురు మహిళా అధికారులు ఉన్నారు. ఒకటో నంబరు గేట్ వద్ద జన్నారం ఎఫ్‌ఆర్‌వో హఫీజొద్దీన్ డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి, వన్యప్రాణులు, అడవుల సంరక్షణపై వివరించారు. శిక్షణ అధికారులు గొండుగూడ బేస్‌క్యాంపు, బైసన్‌కుంట, మైసమ్మకుంట ప్రాంతాల్లో పర్యటించారు. గడ్డి క్షేత్రాలు, కుంటల నిర్మాణం, అభివృద్ధి పనులపై తెలియజేశారు. టైగర్ కదలికలు తెలుసుకునే విధానం, సీసీ కెమెరాలు, స్మగ్లింగ్ నిరోధం తదితర అంశాలను వివరించారు. వారి వెంట డీఆర్వో తిరుపతి, సిబ్బంది ఉన్నారు.

గిరిజన తండాలో కేంద్ర బృందం తనిఖీలు



కొలాంగూడలో పరిశీలిస్తున్న కేంద్ర బృందం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామ పంచాయతీ పరిధి కొలాంగూడ గిరిజన తండాలో పీఎం–జన్‌మన్ యోజన పథకం కేంద్ర బృందం సభ్యులు బుధవారం ఆకస్మిక పర్యటనలో భాగంగా విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. గిరిజనుల ఇళ్లకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. పెద్దంపేట కొలాంగూడ గిరిజన తండాల్లో 6 విద్యుత్ కనెక్షన్లు, నాగారం గ్రామ పంచాయతీలో 10 విద్యుత్ కనెక్షన్లతో కలిపి విద్యుత్ మీటర్లను ఏర్పాటు చేయగా ఢిల్లీ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఢిల్లీ బృందంలో పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ చీఫ్ మేనేజర్ శైలేంద్రసింగ్, మేనేజర్ కమల్, కో ఆర్డినేటర్ పాండునాయక్ ఉన్నారు. వరంగల్ డీఈ ప్రాజెక్ట్ మృత్యుంజయ్, ప్రాజెక్ట్ ఏడీఈ శ్రీనివాస్, మంచిర్యాల ఎస్‌ఈ శేషారావు, మంచిర్యాల రూరల్ ఏడీఓ నూక రాజశేఖర్, హాజీపూర్ ఏఈ మహేందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఏసీపీలు బదిలీ

మంచిర్యాలక్రైం: జిల్లాలో పని చేస్తున్న ఏసీపీలు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి ఖమ్మం ఏసీపీగా బదిలీ కాగా, ఆర్.ప్రకాష్‌ను మంచిర్యాల ఏసీపీగా నియమించారు. జైపూర్ ఏసీపీ బి.మోహన్‌ను హైదరాబాద్ డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఆయన స్థానంలో ఏ.వెంకటేశ్వర్లును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

16న జెడ్పీ సమావేశం

పాతమంచిర్యాల: స్థానిక జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 16న జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సీఈఓ గణపతి ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని పేర్కొన్నారు.

జ్ఞానాన్ని ప్రసాదించు తల్లీ..

- భక్తులతో నిండిన బాసర
- అర్ధరాత్రి నుంచే క్యూలైన్లు
- చదువులతల్లి దర్శనం కోసం బారులు
- చిన్నారులకు అక్షరాభ్యాసాలు
- ఘనంగా వసంతపంచమి వేడుకలు
- అసౌకర్యాలతో భక్తులకు అవస్థలు



అక్షరాభ్యాసానికి బారులు తీరిన భక్తులు



చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న పండితుడు

భైంసా: 'శరదిందు సమాకారే పరబ్రహ్మ స్వరూపిణి! వాసరా పీఠనిలయే సరస్వతీ నమోస్తుతే!!'.. అని ఆ బాసర సరస్వతమ్మను కొలుస్తూ.. 'చదువులతల్లీ చల్లంగా చూడమ్మా.. మా పిల్లలకు విద్యాబుద్ధులు, జ్ఞానాన్ని ప్రసాదించు తల్లీ..' అంటూ రెండుచేతులెత్తి మొక్కారు. పవిత్ర గోదావరితీరంలో వ్యాసమహర్షి చేతుల్లో ప్రాణప్రతిష్ఠ పొందిన జ్ఞానసరస్వతీమాత జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వసంతపంచమి పర్వదినం పురస్కరించుకుని బుధవారం నిర్మల్ జిల్లా బాసర భక్తజన సంద్రమైంది. తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తజన వాహినితో చదువులమ్మ పులకించిపోయింది.

వేకువజాము నుంచే..

వసంతపంచమి పర్వదినాన తెల్లవారుజామున 2గంటల నుంచే జ్ఞానసరస్వతీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ముందుగా అమ్మవారికి అభిషేక సేవతో ఉత్సవం ప్రారంభమైంది. అర్చకులు, వేదపండితులు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు మంగళవారం అర్ధరాత్రి నుంచే గోదావరిలో స్నానాలు ఆచరించారు. గోదావరి స్నానఘట్టాలు భక్తులతో నిండిపోయాయి. అక్కడి నుంచి ఆలయానికి చేరుకుని అమ్మవారి దర్శనానికి, చిన్నారుల అక్షరాభ్యాసానికి వేకువజామున 4గంటల నుంచే క్యూ లైన్లలో నిల్చున్నారు. దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టింది. మధ్యాహ్నం చండీహోమం, వేద పారాయణ పూజలు నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలు, అభిషేక పూజలు భారీగా జరిగాయి.

అమ్మవారికి పట్టువస్త్రాలు..

తెల్లవారుజామున అమ్మవారికి నిర్వహించిన అభిషేక పూజలో స్థానిక ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ పాల్గొన్నారు. ఆ తర్వాత ఉదయం 8 గంటలకు ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్యే రామారావు పటేల్, ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ తదితరులు కలిసి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఏటా దేవాదాయశాఖ మంత్రి హోదాలో అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించేవారు. ఈసారి వసంత పంచమి వేడుకలకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ రాలేకపోయారు.

అవే సమస్యలు.. తప్పని అవస్థలు

వసంత పంచమికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేసినా అవి సరిపోలేదు. భక్తుల క్యూలైన్ దేవాలయ అతిథి గృహాలు దాటి ప్రధాన రోడ్డు వరకూ చేరింది. చిన్నారులు, వృద్ధులు గంటల తరబడి క్యూలో వేచి ఉండలేక నానాఅవస్థలు పడ్డారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారి దర్శనం చేసుకునేందుకు మాత్రం ఇబ్బందులు పడ్డారు. దూరప్రాంత భక్తులు ఒక్కరోజు ముందుగానే ఆలయానికి చేరుకున్నారు. రాత్రిపూట వసతి గదులు దొరకక ఆరుబయటే చలి, దోమల్లో నిద్రించాల్సి వచ్చింది.

క్షేత్ర దర్శనం..

దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి దర్శనంతోపాటు బాసరను చుట్టివచ్చారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు పడవలో ప్రయాణించారు. వ్యాసమహర్షి గుహ వద్ద దర్శనానికి భక్తులు వరుసలు కట్టారు. బస్టాండ్ వద్ద ఉన్న వేదవతి శిలను రాళ్లతో కొట్టి అందులో నుంచి వచ్చే స్వరాలను ఆస్వాదించారు. పలువురు భక్తులు పాదయాత్రగా బాసరకు చేరుకోవడం కనిపించింది. రోజంతా ఆలయంలో అమ్మవారిని స్మరిస్తూ భజనలు చేస్తూ ఆధ్యాత్మిక ప్రసంగాలు కొనసాగించారు. వసంతపంచమి సందర్భంగా బాసర ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఆలయ గర్భగుడిని పూలతో అందంగా అలంకరించారు. ప్రాంగణాన్ని విద్యుత్‌దీపాలతో ముస్తాబు చేశారు. ప్రధాన ద్వారం వద్ద స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు.

భక్తులకు పలు సేవలు..

భక్తులకు ఆలయంతో పాటు స్వచ్ఛంద సేవాసంస్థల ఆధ్వర్యంలో చిన్నారులకు పాలు, బిస్కట్లు, అరటిపండ్లు, నీళ్లు అందజేశారు. జిల్లా ఎస్పీ జానకీషర్మిల, భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ పర్యవేక్షించారు. పోలీసు సిబ్బంది ప్రధాన ద్వారాల వద్ద బందోబస్తు చేశారు. బాసర రైల్వేస్టేషన్, బస్టాండ్, స్నానఘట్టాల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వచ్చిన వాహనాలను పార్కింగ్ స్థలాల వైపు మళ్లించారు.

ఉదయం నుంచి రాత్రి వరకు...

బాసర ఆలయంలో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల తాకిడి కనిపించింది. గతంతో పోలిస్తే ఈసారి భారీగా భక్తులు తరలివచ్చారు. దూరప్రాంతాల నుంచి రైలుమార్గంలో చేరుకున్నారు. నిజామాబాద్, భైంసారూట్‌లలో వచ్చే బస్సులు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ప్రత్యేక వాహనాలను పోలీస్‌స్టేషన్ సమీపంలో, శాంకరీ ముందు స్థలంలో నిలిపివేశారు. వసంత పంచమి సందర్భంగా పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులతో వ్యాపారులకు చేతినిండా గిరాకీ దొరికింది. హోటళ్లు, టీకొట్లు, ఫలహారశాలలు భక్తులతో నిండిపోయాయి. అమ్మవారి ప్రసాదాల కౌంటర్ వద్ద గంటల తరబడి నిలబడాల్సి వచ్చింది.

క్లుప్తంగా

కోతికి అంత్యక్రియలు



మృతిచెందిన కోతితో ఉదయ్‌సింగ్

భీమిని: మనుషులు, జంతువుల మధ్య ప్రేమ శతాబ్దాల నాటిది. ఇందుకు ఎన్నో ఉదాహరణలు మనం చూస్తునే ఉన్నాం. జంతువులు మనుషుల పట్ల చూపించే ప్రేమ, విశ్వాసం కొన్ని బంధాలకు ఉదాహరణగా నిలుస్తాయి కూడా. తాజాగా మంచిర్యాల జిల్లా భీమిని మండలంలోని ఖర్జీభీంపూర్ గ్రామంలో ఠాకూర్ ఉదయ్‌సింగ్ అనే వ్యక్తి ఓ కోతికి బుధవారం అంత్యక్రియలు నిర్వహించి తన గొప్ప మనస్సును చాటి చెప్పాడు. 2000 సంవత్సరంలో ఠాకూర్ ఉదయ్‌సింగ్ ఇంటికి ఓ కోతి వచ్చింది. అప్పటి నుంచి ఆ కోతికి గుల్లు అనే పేరుతో నామకరణం చేసి ఎంతో అల్లారు ముద్దుగా తన కుటుంబ సభ్యుల్లో ఒకరిగా పెంచాడు. 24ఏళ్ల పాటు దానికి ఏ లోటూ రానివ్వకుండా చూసుకున్నాడు. ఇటీవల కోతికి పక్షవాతం రావడంతో అనారోగ్యానికి గురై చనిపోయింది. దీంతో దానిని పూలమాలలతో అలంకరించి ఊరేగింపుగా తీసుకెళ్లి ఖననం చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యం వాహనాలతో అధికారులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని చింతలపల్లి గ్రామ శి వారులో అక్రమంగా మహా రాష్ట్రకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని బుధవారం ఎన్ ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. రేషన్ బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తున్నారనే సమాచారం మేరకు అధికారులు దాడి చేసి వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. సుమారు 66క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని చెన్నూర్‌లోని వ్యవసాయ మార్కెట్‌కు తరలించారు. అలాగే బియ్యం తరలిస్తున్న రెండు వాహనాలను సీజ్ చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ రవిందర్ మాట్లాడారు. మండలంలో రేషన్ బియ్యాన్ని డంపు చేసినా అక్రమ రవాణా చేసినా చట్టపరంగా కేసులు నమోదు చేయడమే కాకుండా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

టేకు దుంగలు పట్టివేత



పట్టుబడిన టేకు దుంగలు

బెల్లంపల్లి: ఓ కారులో అక్రమంగా తరలిస్తున్న టేకు దుంగలను బుధవారం బెల్లంపల్లి అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. బెల్లంపల్లి ఎఫ్ఆర్‌వో సుభాష్ వివరాల ప్రకారం... కుమురంభీం ఆసిఫాబాద్ ప్రాంతం నుంచి ఓ కారులో ఎలాంటి అనుమతి లేకుండా టేకు దుంగలను బెల్లంపల్లికి తీసుకువస్తున్నట్లు అటవీ అధికారులకు సమాచారం అందింది. వెంటనే స్పందించిన అటవీ అధికారులు బెల్లంపల్లి చెరువులో మాటు వేసి కలప రవాణా చేస్తున్న కారును పట్టుకున్నారు. కారులోని ఏడు టేకు దుంగలు ఉన్నట్లు గుర్తించగా వీటి విలువ రూ.35 వేల వరకు ఉంటుందని అధికారులు ప్రకటించారు. ఈ మేరకు కారును, టేకు దుంగలను స్వాధీనం చేసుకుని అటవీ రేంజ్ కార్యాలయానికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అటవీ అధికారులు తెలిపారు. ఈ దాడిలో డిప్యూటీ ఎఫ్ఆర్ఓ గౌరి శంకర్, ఎఫ్ఎస్ఓ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రతకు భరోసా..

- లైంగికదాడుల బాధితులకు అండగా కేంద్రం
- అన్యాయానికి గురైన బాలికలు, మహిళలకు సత్వర న్యాయం
- స్నేహపూర్వక వాతావరణంలో అవగాహన
- జిల్లాలో పెరుగుతున్న పోక్సో కేసులు

మంచిర్యాల జిల్లాలో 2023లో నమోదైన కేసులు..

అత్యాచారం	25
పోక్సో	16
వేధింపులు	234

2024 జనవరి, ఫిబ్రవరి 11 వరకు పోక్సో కేసులు 3, అత్యాచారం కేసు ఒకటి నమోదైంది.



సీసీసీ నస్పూర్‌లో ఏర్పాటైన భరోసా కేంద్ర భవనం

మంచిర్యాలక్రైం: ఆమె తల్లి.. మురిపాల చెల్లి.. జీవితానికి కల్పవల్లి. ఆకాశంలో సగమేకాదు. అవనికి ఆలంబన ఆమె. ఆ మహిళామూర్తి కొందరు ముష్కరుల కారణంగా అన్యాయానికి గురవుతోంది. పురుష అహంకారం ఆమెపై పంజా విసురుతోంది. కామంధులు మానవత్వం మరిచి పసిమొగ్గలను చిదిమేస్తున్నారు. ఇలాంటి ఆకృత్యాలను అరికడుతూ మహిళలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం పోలీస్‌శాఖలో విమెన్ సేఫ్టీ వింగ్‌ను ఏర్పాటు చేసింది. దీనికి అనుబంధంగా ఇప్పటికే షీటీం పనిచేస్తోంది. బాలికల భద్రత కోసం మరో భరోసా కేంద్రాన్ని జిల్లా సమీపంలోని సీసీసీ నస్పూర్ పట్టణంలోని సింగరేణి క్వార్టర్‌లో ఏర్పాటు చేయగా ఈ నెల 6న డీజీపీ రవిగుప్తా వర్చ్యువల్ ద్వారా ప్రారంభించారు. వేధింపులకు గురైన చిన్న పిల్లలు, మహిళలకు భరోసా కేంద్రం అండగా నిల్వనుంది.

కేంద్రం నిర్వహణలో...

భరోసా కేంద్రం నిర్వహణ పూర్తిస్థాయి బాధ్యులుగా మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ ప్రవీణ్‌కుమార్, షీటీం ఎస్సై హైమా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. వీరితో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కో–ఆర్డినేటర్‌గా, లీగల్ ఆఫీసర్, సపోర్ట్ పర్సన్, ఏఎన్ఎం, రీసెప్షనిస్టులుగా విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని భరోసా కేంద్రాన్ని పోలీస్‌శాఖలోని రాష్ట్ర విమెన్ సెఫ్టీ వింగ్ విభాగం కమిషనర్‌గా శిఖాగోయాల్ పర్యవేక్షణలో బాలికల, మహిళల రక్షణ కోసం భరోసా కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

బాలికలకు, మహిళలకు అండగా...

చిన్న పిల్లలు మొదలుకొని వయస్సుతో సంబంధం లేకుండా కులం, విద్యాస్థితి, వైవాహికస్థితి, జాతి, సంస్కృతితో సంబంధం లేకుండా శారీరక, లైంగిక, భావోద్వేగా, మానసిక, ఆర్థిక వేధింపులను ఎదుర్కొంటున్న మహిళలకు మద్దతు ఇవ్వడంతో పాటు వారి సమస్యలకు భరోసా కేంద్రంలో పరిష్కారం లభించనుంది. భరోసా కేంద్రం ద్వారా పోలీస్, మెడికల్, లీగల్ ప్రాసిక్యూషన్ సర్వీసెస్‌తో పాటు సైకోథేరప్యూటిక్ కౌన్సెలింగ్ ద్వారా సమీకృత సాయం అందించేందుకు ఏర్పాట్లు సైతం చేస్తున్నారు.

మహిళల భద్రతే లక్ష్యంగా...

తెలంగాణ ప్రభుత్వం మహిళల భద్రతకు ప్రత్యేక చొరువ తీసుకుంటుంది. ఇప్పటి వరకు మహిళల భద్రత కోసం షీ టీమ్, సఖీ సెంటర్, మహిళలు ప్రయాణం చేస్తున్నప్పుడు రక్షణ కోసం అబయ యాప్, హాక్–హై లాంటి యాప్‌లను అందుబాటులోకి తెచ్చింది. మరింత భద్రత కల్పించడమే లక్ష్యంగా భరోసా కేంద్రాలను ప్రారంభించింది. మహిళలపై జరిగే అఘాయిత్యాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు భరోసా కేంద్రం వైద్య, చట్టపరమైన, మానసిక కౌన్సెలింగ్ మద్దతిలో అత్యవసర, నాన్–ఎమర్జెన్సి యాక్సెస్ సేవలు సులభతరం చేయనుంది. బాధిత మహిళలతో స్నేహపూర్వకంగా వ్యవహరించేందుకు శిక్షణ పొందిన మహిళలను నియమిస్తున్నారు. అన్యాయం, అత్యాచారం, గృహహింసా, వేధింపులు, మోసానికి గురైనా బాలికలకు మానసికంగా ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు భరోసా కేంద్రాలు అండగా నిలువనున్నాయి.

బాధితులు ధైర్యంగా ఉండాలి



బాధితులు న్యాయం జరిగే వరకూ ధైర్యంగా ఉండాలి. పోలీస్‌స్టేషన్ నుంచి ఇక్కడికి బాధితులు వచ్చిన తర్వాత వారికి కావాల్సిన అన్ని రకాల ఏర్పాట్లు చేయడం జరుగుతోంది. బాలికలు ఎక్కడైనా వేధింపులకు గురైనా, అత్యాచారానికి గురైన నేరుగా భరోసా కేంద్రానికి వచ్చి ఫిర్యాదు చేయాలి. బాలికల, మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పోక్సో కేసుల్లో నేరుగా భరోసా కేంద్రంలో సంప్రదించాలి.– హైమా, ఎస్సై, షీటీం, భరోసా కేంద్రం ఇన్‌చార్జి, మంచిర్యాల

కలప స్మగ్లర్‌కు 14రోజుల రిమాండ్



నిందితుడితో అటవీశాఖ సిబ్బంది

జన్నారం: జన్నారం అటవి డివిజన్‌లోని తాళ్లపేట్ రేంజ్ తపాలపూర్, మహ్మదబాద్ బీట్‌లలో అక్రమంగా చెట్లు కొట్టి కలప స్మగ్లింగ్‌కు పాల్పడిన నిందితుడికి లక్సెట్టిపేట్ న్యాయమూర్తి 14రోజుల రిమాండ్ విధించినట్లు తాళ్లపేట్ రేంజ్ అధికారి సుష్మరావు తెలిపారు. బుధవారం ఎఫ్ఆర్‌వో వివరాలు వెల్లడించాడు. మల్యాల గ్రామానికి చెందిన ముడితే నర్సయ్య తాళ్లపేట్ రేంజ్ పరిధిలోని తపాలపూర్‌లో గతంలో స్మగ్లింగ్‌కు పాల్పడగా కేసు నమోదైంది. మంగళవారం తెల్లవారు జామున మళ్లీ మహ్మదబాద్ బీట్‌లో కలప స్మగ్లింగ్‌కు పాల్పడినట్లు సమాచారం రాగానే పట్టుకుని కోర్టులో హాజరుపరిచినట్లు వివరించారు. న్యాయమూర్తి అతడికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

డీవైఎస్‌వోగా రాజ్‌వీర్

మంచిర్యాలక్రైం: జిల్లా యువజన క్రీడాల శాఖ అధికారిగా కే.రాజ్‌వీర్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన శ్రీకాంత్‌రెడ్డి కరీంనగర్ డీవైఎస్‌ఓగా బదిలీపై వెళ్లారు.

ఘనంగా ధ్వజ స్తంభం ప్రతిష్టాపన

- ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ విఠల్



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీబుగ్గ రాజేశ్వరస్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభం ప్రతిష్టాపన కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచే ఆలయంలో గణపతి పూజ, ప్రత్యేక హోమం, పూజలు నిర్వహించారు. వేదపండితుల వేద మంత్రోచ్చరణల నడుమ న్యారేపతో చేసిన ధ్వజ స్తంభాన్ని ప్రతిష్టింపచేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ దండె విఠల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూర్ణకుంబంతో విఠల్‌కు ఘన స్వాగతం పలికారు. బుగ్గ ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తాన్నారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచందర్, కాంగ్రెస్ నాయకులు స్వామి, రవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నాయకులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీదేవి, ధ్వజస్తంభం దాత సుంకరి రాజేశ్వరి రాజేష్ దంపతులు, ఆలయ ఈవో బాపురెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, జేపీఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విప్రో స్కాలర్‌షిప్‌కు డిగ్రీ విద్యార్థిని ఎంపిక



స్కాలర్‌షిప్ పత్రం అందిస్తున్న ప్రిన్సిపాల్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని విప్రో స్కాలర్‌షిప్‌కు ఎంపికైంది. బీఎస్సీ బీజెడ్‌సీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని దడంగి అఖిల 2023–24 విద్యా సంవత్సరానికి విప్రో సంతూర్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ప్రతీ విద్యాసంవత్సరం రూ.24 వేల చొప్పున మూడేళ్లపాటు స్కాలర్‌షిప్‌ను విప్రో సంస్థ అందజేస్తుంది. నెన్నెల మండలానికి చెందిన దడంగి రమేష్, లక్ష్మి దంపతుల నాలుగో సంతానం అఖిలది నిరుపేద కుటుంబం. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అఖిలను ప్రిన్సిపాల్ అభినందించి ఎంపిక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీలత, అధ్యాపకుడు తిరుపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

తానూరు: పురుగుల మందుతాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని భోసి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఏఎస్సై నర్సింగ్ బాను వివరాల ప్రకారం.. మేకల గంగాధర్(34) ఈ నెల 12వ తేదీన భైంసాకు వెళ్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. బోల్సా శివారు ప్రాంతంలో పురుగుల మందు తాగాడు. బుధవారం అక్కడి వెళ్లిన కొంతమంది రైతులు మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. తల్లి మేకల లక్ష్మిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఓసీపీలో కాంట్రాక్ట్ ఆపరేటర్‌కు గాయాలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్టు గనిలో బుధవారం తెల్లవారు జామున 4గంటల ప్రాంతంలో జరిగిన ప్రమాదంలో కాంట్రాక్టు డంపర్ ఆపరేటర్ మొగిలి శ్రీకాంత్ తీవ్రంగా గాయపడ్డాడు. ఓబీ డంపర్‌ను అన్‌లోడ్ చేసి తిరిగి వస్తుండగా షిఫ్ట్ చేజింగ్ పాయింట్ వద్ద ఆగి ఉన్న మరో డంపర్‌ను వెనుకాల నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆయన కుడికాలు విరిగి తెగిపోయింది. సమీపంలోని తోటి ఓబీ కాంట్రాక్టు ఆపరేటర్లు వచ్చి డంపర్‌లో చిక్కుకున్న శ్రీకాంత్‌ను బయటకు తీసి మంచిర్యాలలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతున్నాడు. ఘటన స్థలాన్ని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బండారి సుధాకర్, నాయకులు సందర్శించారు. బాధితుడికి నష్టపరిహారం చెల్లించాలని, మెరుగైన వైద్యం అందించాలని ఓబీ కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులను డిమాండ్ చేశారు. రాత్రి పూట ఆగి ఉన్న డంపర్‌కు వెనుకాల పార్కింగ్‌లైట్లు, రేడియం స్టిక్కర్లు లేవని, దీంతో ప్రమాదం జరిగిందని తెలిపారు.

ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు

కాసిపేట: మండలంలోని దేవాపూర్ గ్రామపంచాయతీ అవరణలో గురువారం చేపట్టనున్న ఓరియంట్ సిమెంట్ కంపెనీ సున్నపురాయి మైనింగ్ విస్తరణ ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సున్నపురాయి రెండో గని ఏర్పాటుకు 588.26 హెక్టార్లు అనుమతుల కోసం టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నారు. మైనింగ్‌కు సంబంధించి దేవాపూర్, గట్రావుపల్లి గ్రామాల శివారులోని భూమి అవసరం ఉంది. ప్రాజెక్టు వ్యయం 208.22కోట్లుగా అధికారులు ప్రకటించారు. కాగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు కంపెనీ ముందుకు వెళ్తుండగా స్థానిక ఆదివాసీలు మాత్రం ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించలేదనే ఆగ్రహంతో ఉన్నారు. గట్రావుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ప్రజాభిప్రాయ సేకరణ ప్రత్యేకంగా చేపట్టాలని మా పరిధిలో భూములు ఎక్కువగా పోతున్నాయంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సభ నిర్వహణకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయగా స్థానికంగా ఆదివాసీలు తమ నిరసన తెలిపేందుకు సిద్ధం అవుతున్నారు.

ప్రాణం తీసిన వివాహేతర బంధం



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్

- యువకుడిని అంతమొందించిన వివాహిత
- శవాన్ని కాల్చి మాయం చేసేందుకు యత్నం
- 24గంటల్లో నిందితుల అరెస్ట్



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీసీపీ



మహేందర్ (ఫైల్)

మంచిర్యాలక్రైం/చెన్నూర్‌రూరల్: ఐదేళ్ల పాటు ఓ యువకుడు వివాహితతో సహజీవనం గడిపాడు. చివరకు సదరు వివాహిత చేతిలో దారుణంగా హత్యకు గురైన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించాడు. చెన్నూర్ మండలం పొన్నారం గ్రామానికి చెందిన రామగిరి మహేందర్(35)కు అదే గ్రామానికి చెందిన పద్మ(వివాహిత)తో ఐదేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగుతోంది. నాలుగు నెలల క్రితం పద్మ భర్త శేఖర్‌ను, ఇద్దరు పిల్లలను వదిలేసి మహేందర్‌తో వెళ్లిపోయింది. భర్త ఫిర్యాదు మేరకు చెన్నూర్ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. కొంతకాలం తర్వాత మహేందర్, పద్మ ఆచూకీ లభించడంతో పోలీసులు వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అయినప్పటికీ మహేందర్‌తోనే ఉండేందుకు పద్మ అంగీకరించింది. నెలరోజుల క్రితం మహేందర్, పద్మల మధ్య గొడవ కావడంతో తల్లిగారి గ్రామమైన కమ్మరిపెల్లికి వెళ్లిపోయింది. ఈ నెల 13న పద్మ మహేందర్‌కు ఫోన్ చేసి ఇంటికి రావాలని కోరింది. దీంతో మహేందర్ తన స్నేహితులైన కడారి శేఖర్, జాలంపల్లి సాయిరాజ్‌తో కలిసి ఆ గ్రామానికి వెళ్లాడు. స్నేహితులను కొంతదూరంలోనే ఉంచి రాత్రి 12గంటలకు పద్మ ఇంట్లోకి వెళ్లాడు.

పథకం ప్రకారమే హత్య...

పథకం ప్రకారం మహేందర్‌ను ఇంటికి పిలిపించి హత్య చేయాలని పద్మ నిర్ణయించుకుంది. ఇంట్లోకి వెళ్లిన మహేందర్‌తో గొడవ మొదలు కావడంతో పద్మ, పద్మ భర్త శేఖర్, తండ్రి మొగిలి ఓదెలు, తల్లి సుగునక్క కర్రలతో దాడిచేసి హత్య చేశారు. ఆ తర్వాత అదే రాత్రి ఎడ్లబండిపై శవాన్ని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి కాల్చివేశారు. ఈ విషయాన్ని శేఖర్, సాయిరాజ్‌ల ద్వారా తెలుసుకున్న మహేందర్ సోదరుడు రవీందర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం కమ్మరిపెల్లికి వెళ్లిన పోలీసులు పద్మ కుటుంబ సభ్యులను నిలదీయగా అసలు విషయం వెలుగుచూసింది.

24గంటల్లో హంతకులట అరెస్ట్..

మహేందర్ హత్య కేసును నమోదు చేసుకున్న చెన్నూర్ సీఐ రవీందర్, డీసీపీ రంగంలోకి దిగారు. అటవీ ప్రాంతంలో సగం కాలిపోయిన మహేందర్ మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు చెన్నూర్‌కు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హత్యకు పాల్పడినవారిని సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

భర్తపై భార్య హత్యాహత్నం

బెల్లంపల్లి: భర్త వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో భార్య హత్యాయత్నానికి పాల్పడిన ఘటన బెల్లంపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. వన్‌టౌన్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ వివరాల ప్రకారం ... బెల్లంపల్లిబస్తీకి చెందిన భూరుగు శంకర్‌తో లతకు కొన్నాళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలంగా భార్యాభర్తలు ఒకరిపై ఒకరు అనుమానాలు పెంచుకున్నారు. ఈ విషయంలో ఇరువురు ఎప్పుడు ఇంట్లో గొడవ పడుతుండేవారు. మంగళవారం రాత్రి సైతం భార్య లత శంకర్‌తో గొడవపడింది. బుధవారం తెల్లవారు జామున సుమారు 2గంటల ప్రాంతంలో ఇంట్లో నిద్రిస్తున్న శంకర్‌పై లత గొడ్డలితో దాడిచేసింది. శంకర్ అరవడంతో లత పారిపోయింది. కుటుంబ సభ్యులు శంకర్‌ను కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు ఎస్సై తెలిపారు. శంకర్‌కు కొడుకు, కూతురు ఉన్నారు. శంకర్ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

భార్యపై భర్త హత్యాయత్నం

కాసిపేట: మండలంలోని కోమటిచేనుకు చెందిన గెడం వసంతపై ఆమె భర్త వెంకటేష్ హత్యాయత్నం చేశాడు. ఎస్ఐ గంగారాం కథనం ప్రకారం.. వసంతకు 15ఏళ్ల క్రితం వెంకటేష్‌తో వివాహమైంది. నాలుగేళ్లుగా అతడికి దూరంగా ఉంటూ కోమటిచేనులోని తన తల్లి ఇంటి సమీపంలో ఉన్న రేకులషెడ్డులో నివసిస్తోంది. ఆమె నిద్రిస్తున్న సమయంలో బుధవారం వేకువజామున 3.30గంటల ప్రాంతంలో రేకుల షెడ్డుపై వెంకటేష్ డీజిల్ పోసి నిప్పంటించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

సైకిల్‌పోలో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో సిబ్బంది

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ఆశ్రమ గిరిజన బాలికల పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి సైకిల్ పోలో క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చారు. జాతీయ స్థాయిలో నాలుగో స్థానం సాధించారని ప్రధానోపాధ్యాయులు గఫార్ తెలిపారు. జనవరి 3నుంచి 5వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిలాయ్‌లో నిర్వహించిన జాతీయస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. క్రీడాకారులు వరలక్ష్మి, అంజలి, రవళి తమిళనాడులో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులను డీటీడీవో గంగారాం, పీడీ బండ జీవరత్నం, సిబ్బంది అభినందించారు.



చదువులమ్మ చెంత.. సమస్యల చింత





చదువులతల్లి సరస్వతి అమ్మవారు కొలువైన బాసరలో భక్తులను సమస్యలు వెంటాడాయి. ప్రధానంగా ఉత్సవాల సందర్భంగా భక్తుల పాట్లు అన్నీ ఇన్నీ కావు. బుధవారం వసంత పంచమి సందర్భంగా వేలాదిగా వచ్చిన భక్తులకు పాత సమస్యలే దర్శనమిచ్చాయి. భక్తుల సంఖ్య అధికంగా ఉంటుందని తెలిసినప్పటికీ అధికారులు మాత్రం తాత్కాలిక పనులపైనే దృష్టిసారించారు. ప్రధానంగా వంద పడకల గదికి సంబంధించిన పనులు పూర్తి కాకపోవడంతో భక్తులకు రూములు లేక చిన్న పిల్లలతో రోడ్డు పక్కనే పడుకున్నారు. మహిళలు టాయిలెట్స్ సౌకర్యం లేక ఇబ్బంది పడ్డారు. క్యూలైన్‌లో తాగునీటికి చిన్నారులకు అవస్థలు తప్పలేదు. పలువురు భక్తులు క్యూలైన్‌లో సొమ్మసిల్లి పడిపోయారు. రాత్రి రెండు గంటల నుంచి అక్షరాభ్యాసాల కోసం చిన్నపిల్లలతో క్యూలైన్‌లో పడుకున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్